క్లుప్తంగా

మన్‌కీ బాత్ వీక్షణ


మన్‌కీ బాత్ వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

అనంతగిరి: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదివారం నిర్వహించిన మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వికారాబాద్‌లో బీజేపీ నాయకులు వీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు నందు, పాండుగౌడ్, వడ్లనందు, నరేందర్‌రెడ్డి, రాజేందర్‌గౌడ్, రమేశ్, అంజయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం


ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేస్తున్న నాయకులు

దుద్యాల్: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమని కుదురుమల్ల మాజీ సర్పంచ్ రఘుపతి పేర్కొన్నారు. ఆదివారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఇళ్లు మంజూరు చేయాలంటే కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పేదలకు ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదని వాపోయారు. దుద్యాల్ మండల కేంద్రంలో మొత్తం 43 మందికి మంజూరు కాగా నేటి వరకు 35 ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభమైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సిములు, సూర్యప్రకాశ్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్

తాండూరు: కాగ్నానది బ్రిడ్జి నిర్మాణాన్ని నాసిరకంగా నిర్మించిన కాంట్రాక్టర్‌పై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్ ఆదివారం పేర్కొన్నారు. తాండూరు పట్టణ శివారులో కాగ్నానది వంతెన నిర్మించిన మూడేళ్లకే కుంగిపోయిందన్నారు. బ్రిడ్జిపై రంధ్రం పడటం అంటే ప్రజల ప్రాణాలతో చెలగాటమేనన్నారు. బ్రిడ్జి నిర్మించిన కాంట్రాక్టర్ నుంచి రూ.16 కోట్లను రికవరీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అప్పుడే మిగిలిన కాంట్రాక్టర్లు అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తారని సూచించారు. ప్రజల నిధులతో నిర్మించే అభివృద్ధి పనులు ధ్వంసమైతే ప్రశ్నించే హక్కు ప్రతీ పౌరుడికి ఉందని ఆయన ఈ సందర్భంగా వివరించారు.

మత్స్యకార్మిక సంక్షేమానికి కృషి

అధ్యక్షుడు ముదిగొండ్ల కృష్ణ


మాట్లాడుతున్న కృష్ణ

దుద్యాల్: హస్నాబాద్ మత్స్యకార్మిక సంక్షేమానికి కృషి చేస్తానని సంఘం అధ్యక్షుడు ముదిగొండ్ల కృష్ణ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక మత్స్యకార్మిక సంఘంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో కొన్నేళ్లుగా మత్స్యకార్మిక సంఘం కొనసాగుతుందని, వారి సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. గ్రామంలో 98 మంది సభ్యులతో సంఘం కొనసాగుతుండగా మరో 150 మంది కొత్త సభ్యులు చేరినట్లు చెప్పారు. గ్రామంలోని ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన వారందరు మత్స్యకారులేనని, సంఘంలో చేరాలనుకుంటే వచ్చి చేరొచ్చని సూచించారు. ప్రతీ ముదిరాజ్ తప్పకుండా ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన మత్స్యకార్మిక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి

యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహ్మద్ బాబా

మద్దూరు: సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి తన మాటలను వెనక్కు తీసుకోవాలని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహ్మద్ బాబా డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. అహర్నిశలు రాష్ట్రాభివృద్ధికి పాటుపడుతున్న ముఖ్యమంత్రిపై హుజూరాబాద్ ఎమ్మెల్యే వ్యాఖ్యలు సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్ మెప్పు కోసం ఆయన దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నాడన్నారు. భవిష్యత్‌లో రెచ్చ గొట్టే మాటలు, తప్పుడు ప్రచారం చేస్తే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

బిల్లులు రాక.. వెతలు తీరక!

- మండలంలో రూ. 29.33లక్షలు బకాయిలు
- ఆరు నెలలుగా పెండింగ్
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న మధ్యాహ్న భోజన కార్మికులు
- పట్టించుకోని అధికారులు


మధ్యాహ్న భోజనం వండుతున్న కార్మికులు (ఫైల్)

దోమ: మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులు సకాలంలో విడుదల కాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆరు నెలలుగా అవి పెండింగ్‌లోనే ఉన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూరగాయలు, పప్పు, ఉప్పు, నూనె, గుడ్లు, తదితర సామాగ్రిని అప్పులు తెచ్చి వండుతూ విద్యార్థులకు వడ్డిస్తున్నామని వాపోతున్నారు. ఈ విషయంలో తమకు సకాలంలో బిల్లులు చెల్లించాలని అధికారులను కోరామని, వాటికి సంబంధించిన నివేదికలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించామని వారు బదులిస్తున్నారు. త్వరలో డబ్బులు బ్యాంకుఖాతాలో జమ అవుతాయని చెబుతున్నారు. కానీ నేటి వరకు బిల్లులు మంజూరు కావడంలేదు.

మండలంలో మొత్తం 70 పాఠశాలల్లో..

దోమ మండల వ్యాప్తంగా మొత్తం 36 గ్రామ పంచాయతీలు ఉండగా అందులో 70 పాఠశాలలు ఉన్నాయి. అందులో 10 ఉన్నత పాఠశాలలు, 8 ప్రాథమికోన్నత పాఠశాలలు, 52 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వీటిలో మొత్తం 5,466 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరందరికి వంట కార్మికులు క్రమం తప్పకుండా భోజనం అందజేస్తున్నారు. కానీ వారి బిల్లులు మాత్రం రావడం లేదని వాపోతున్నారు. ఒకటో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు రూ.14,39,000లు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. తొమ్మిది, పదోతరగతి వరకు రూ.7లక్షలు ఉన్నాయని, గుడ్లకు సంబంధించి రూ.7,94,000లు రావాల్సి ఉందని చెబుతున్నారు. ఈ విషయంలో పట్టించుకునే వారు కరువయ్యారు.

డిసెంబర్ నుంచి నేటి వరకు

పాఠశాలలో వంట కార్మికులకు డిసెంబర్ నుంచి నేటి వరకు జీతాలు రాలేదని, దీంతో తాము నానా అవస్థలు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. మండల వ్యాప్తంగా 150 మంది వంట కార్మికులు ఉండగా వారందరికీ రూ.9,00,000ల వరకు జీతాలు రావాల్సి ఉందని అంటున్నారు. జీతాలు రావడం లేదని అధికారులు దృష్టికి తీసుకెళ్లినప్పటికి వస్తాయనే చెబుతున్నారు.

బిల్లులు ఆపితే పోరాటం



వంట కార్మికుల బిల్లులు ఆపితే కార్మికులతో కలిసి ప్రభుత్వంతో పోరాటం చేస్తాం. చాలా మంది కార్మికులు బిల్లులు రాక నానా అవస్థలు పడుతున్నారు. వడ్డీలకు అప్పులు తెచ్చి వంటలు వండుతూ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండి పెడుతున్నాం. కార్మికులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను మంజూరు చేసేవిధంగా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి. లేని పక్షంలో జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని కార్మికులతో కలిసి ముట్టడిస్తాం.

– ఎం.వెంకటయ్య, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు

అప్పులు తెచ్చి వండుతున్నాం



మధ్యాహ్న భోజనం కోసం అప్పులు తెచ్చి వండుతున్నాం. ప్రతీరోజు విద్యార్థులకు వడ్డిస్తున్నాం. వాటికి సంబంధించి ఆరు నెలల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. అధికారులను అడిగితే బిల్లులు చేసి పంపించామని బదులిస్తున్నారు. కానీ తమకు నేటికి రూపాయి కూడా అందలేదు. అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి వంటలు వండుతున్నాం. అధికారులు స్పందించి సత్వరమే బిల్లులు మంజూరు చేయాలి.

– అలివేలు, వంట కార్మికురాలు, దోమ

చర్యలు తీసుకోవాలి



మధ్యాహ్న భోజన బిల్లులు రాక తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఆరు నెలలుగా పెండిగ్‌లోనే ఉన్నాయి. నిత్యం అధికారులను అడుగుతూనే ఉన్నాం. ఇదిగో..అదిగో వస్తాయని చెబుతున్నారు. తెచ్చిన అప్పులకు వడ్డీలు పేరుకుపోతున్నాయి. సంబంధిత అధికారులు తమకు బిల్లులు వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

– మాదలమ్మ, కిష్టాపూర్, కార్మికురాలు

నివేదికలు పంపించాం



కార్మికులకు అందాల్సిన మధ్యాహ్న భోజన బిల్లులు సకాలంలో అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటివరకు ఒకటోతరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు బిల్లులు ప్రతి కార్మికురాలి ఖాతాలో పడ్డాయి. తొమ్మిది, పదో తరగతి బిల్లులు, గుడ్ల బిల్లులు రావాల్సి ఉంది. కార్మికుల జీతాలు సైతం రావాల్సి ఉంది. వాటి నివేదికలను తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించాం. త్వరలో వస్తాయి.

– వెంకట్, ఎంఈఓ, దోమ

కార్మిక సభ్యత్వంతో ఆర్థిక భరోసా


మాట్లాడుతున్న మొగులయ్య

సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మొగులయ్య

బొంరాస్‌పేట: భవన నిర్మాణ కార్మికులు సభ్యత్వం తీసుకుంటే భవిష్యత్‌లో ప్రభుత్వం నుంచి పలురకాల ఆర్థిక భరోసా కల్పించే పథకాలు అందుతాయని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మొగులయ్య పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని రేగడిమైలారంలో భవన నిర్మాణ కార్మికులు, దినసరి కూలీలకు సంఘం సభ్యత్వం కలిగి ఉంటే ప్రభుత్వం నుంచి లబ్ధి పొందే సౌకర్యాల గురించి ఆయన వివరించారు. ఇటీవల కార్మికసంఘం సభ్యత్వం ఉన్న ముసులుగళ్ల రాములు కుటుంబానికి రూ.30వేలు అందజేసినట్లు తెలిపారు. తాలూకా మొత్తంలో 600మంది భవన నిర్మాణ కార్మికులు సభ్యత్వం తీసుకున్నారని, ఇందులో వంద మందికి పైగా పలురకాల ఆర్థిక సాయం తీసుకున్నట్లు చెప్పారు. ప్రతి భవన నిర్మాణకార్మికులు తప్పనిసరిగా సభ్యత్వం తీసుకొని కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు రాములు, అంబేడ్కర్ సంఘం గ్రామ అధ్యక్షుడు దాసరి యేసు తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

బంట్వారం: అధిక వర్షాలకు పంటలు నష్టపోకుండా రైతులు యాజమాన్య పద్ధతులు చేపట్టాలని వ్యవసాయ శాఖ కోట్‌పల్లి ఏఈఓ సందీప్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పంట దశను బట్టి నష్ట తీవ్రత ఉంటుందని పేర్కొన్నారు. చీడపీడలు అధికమౌతాయని వివరించారు. అలాగే పంట దిగుబడి తగ్గి నాణ్యత కూడా లోపిస్తుందని, పంటలలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే వర్షాల నుంచి కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. కంది పంటలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు నీరు తీసేయాలని, వర్షాలు తగ్గాక గొర్రు లేదా గుంటుకలతో అంతర కృషిని చేపట్టాలని పేర్కొన్నారు. పత్తిలో నీరు నిల్వ ఉన్న చోట తక్షణమే పొలం నుంచి తొలగించాలని, మురుగు నీరు లేకుండా ప్రత్యేక ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎకరాకు 25 కిలోల యూరియా, 10కిలోల పొటాష్ కలిపి మొక్కల దగ్గర వేయాలని తెలిపారు. మొక్కజొన్నకు సంబంధించి, బ్యాక్టీరియ కాండం, తెగులుపై పలు సూచనలు చేశారు. మినుము, పెసర, సోయా చిక్కుడు పంటలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన రైతులకు సూచించారు. ఏమైనా సందేహాలు ఉంటే వ్యవసాయ అధికారులను సంప్రదించాలని ఆయన కోరారు.

గురువుల స్ఫూర్తితో ఎదిగాం

పూర్వ విద్యార్థులు

కొడంగల్ రూరల్: గురువుల స్ఫూర్తితోనే ఉన్నత స్థానాలకు ఎదిగామని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని శ్రీబాలాజీ కేజీ ఉన్నత పాఠశాలలో 1997–98 బ్యాచ్ విద్యార్థులు ఉత్సాహంగా గడుపుతూ తమ అనుభవాలను పంచుకున్నారు. 27ఏళ్ల తరువాత కలుసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుంటూ అప్పటి జ్ఞాపకాలను పంచుకున్నారు. అప్పట్లో చదువులు చెప్పిన గురువులు రవీందర్, వెంకటప్ప, పద్మ, నిర్మల, షహీద, నర్సింగ్‌నాయక్‌లను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానం చేశారు. అనంతరం పూర్వ విద్యార్థులు క్రాంతికుమార్, శ్రీకాంత్, నాగరాజు, ప్రవీణ్, చంద్రమోహన్, సంజీవ్, హేమలత, జయశ్రీ తదితరులు ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు.


గురువులతో పూర్వ విద్యార్థులు

వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించాలి

అనంతగిరి: జిల్లాలోని వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీఆర్ కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. అద్దె భవనాల్లో చాలిచాలని గదులు, మరుగుదొడ్లు ఉండటంతో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. ఇరుకు గదుల్లోనే పదుల సంఖ్యలో విద్యార్థులు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆడుకోవడానికి మైదానాలు లేకపోవడంతో వారు క్రీడలకు దూరం అవుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు అద్దె భవనాల్లో కొనసాగుతున్న వసతిగృహాలకు సొంత భవనాల ఏర్పాటు కోసం స్థల సేకరణ నిర్వహించి నిర్మాణాలు చేపట్టాలని ఆయన కోరారు.

నూతన ఎస్‌ఐగా వసంత్‌జాదవ్



దోమ: మండల నూతన ఎస్‌ఐగా వడ్యా వసంత్‌జాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన ఆదివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేసిన ఎస్‌ఐ ఆనంద్‌కుమార్ పీసీఆర్ వికారాబాద్‌కు అటాచ్ కావడంతో ఆయన స్థానంలో తాండూర్‌టౌన్ ఎస్‌ఐ-2గా విధులు నిర్వహిస్తున్న వడ్యా వసంత్‌జాదవ్‌ను అధికారులు నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పాంబండపై టెంకాయల విక్రయానికి వేలం

కుల్కచర్ల: శ్రావణమాస సందర్భంగా నిర్వహించనున్న ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ ప్రాంతంలో టెంకాయలు విక్రయించుకునేందుకు టెండర్లను ఆహ్వానిస్తున్నామని ఆలయ చైర్మన్ కొట్ల మైపాల్ రెడ్డి, ఈఓ బాలనర్సయ్యలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 16నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్న చిన్న జాతరలో టెంకాయలు విక్రయించుకునేందుకు ఆగస్టు 5న బహిరంగ వేలం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆసక్తిగల వారు ముందస్తు ధరావత్తు రూ.10వేలు చెల్లించి వేలంలో పాల్గొనాలని వారు సూచించారు.

వేదాద్రిలో సామూహిక వ్రతాలు

ఆమనగల్లు: వెల్జాలలో వేదాద్రి లక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో ఆదివారం భక్తులు సామూహిక సత్యనారాయణ స్వామి వారి వ్రతాలను ఆచరించారు. శ్రావణమాసం ప్రారంభం కావడంతో ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేసి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఈ పూజా కార్యక్రమంలో ఆమనగల్లు మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకటరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ఆలయ నిర్వాహకులు శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

ధారూరు: మండల పరిధిలోని కేరెల్లి శ్రీసత్యసాయి సార్వజనిక కేంద్రంలో ఆదివారం ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహించారు. హైదరాబాద్ సావిత్రమ్మ మెమోరియల్ ట్రస్ట్, వికారాబాద్‌జిల్లా సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో హైదరాబాద్ సాధూరాం కంటి వైద్యశాల వారిచే ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. ఇక్కడ కంటి సమస్యలున్న 195 మందిని వైద్యులు పరీక్షించారు. 40 మందికి కంటి ఆపరేషన్ చేయాలని గుర్తించారు. త్వరలో వీరికి సాధూరాం కంటి ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేయనున్నామని వైద్యులు పేర్కొన్నారు. అనంతరం అవసరమైన 120మందికి కంటి అద్దాలు ఉచింతగా పంపిణీ చేశారు. ఈ శిబిరంలో హైదరాబాద్ సావిత్రమ్మ మెమోరియల్ ట్రస్ట్ సమన్వయ కర్తలు మహ్మద్ బషీర్, చిరంజీవిరెడ్డి, కేరెల్లి శ్రీసత్యసాయి సార్వజనిక కేంద్రం సలహాదారు అనంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం. ప్రేమ్‌కుమార్, కోశాధికారి వెంకట్‌రెడ్డి, సాధూరాం కంటివైద్యశాల డాక్టర్లు లక్ష్మణ్, అజిత్, భగవాన్‌లు, క్యాంపు సమన్వయ కర్తలు రామకృష్ణ, యాదగిరిలు, సత్యసాయి సేవాదళ్ సభ్యులు, బాలవికాస్ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు నోట్‌బుక్స్ పంపిణీ

- కేటీఆర్ పిలుపు మేరకు గిఫ్ట్ ఏ స్మైల్
- రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్


నోట్ బుక్స్ పంపిణీ చేసిన శుభప్రద్ పటేల్

తాండూరు టౌన్: మాజీ మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. తాండూరు పట్టణంలోని బీసీ కళాశాల వసతి గృహంలో ఆదివారం రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, అలాంటి వారి విజయగాథలను ఆదర్శంగా తీసుకుని భవిష్యత్‌లో ఉన్నత స్థానానికి ఎదగాలని ఆయన విద్యార్థినులకు సూచించారు. ఈ కార్యక్రమంలో భానుప్రసాద్, శ్రీశైలం, లక్ష్మణాచారి, సాయి మనోహర్, గౌస్, మోయిజ్, చందు పటేల్, రమేశ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో ఏదైనా సాధించవచ్చు

కర్ణాటక రాష్ట్ర జాకన్‌పల్లి మఠాధిపతులు సిద్ధలింగేశ్వర స్వామిజీ

దుద్యాల్: ప్రతీరోజు కొంత సమయం దైవ ప్రార్థన చేయడంతో దేన్నైనా సాధించవచ్చని కర్ణాటక రాష్ట్ర జాకన్‌పల్లి మఠాధిపతులు గవి సిద్ధలింగేశ్వర స్వామిజీ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని చిల్‌ముల్ మైలారం గ్రామంలోని వినయ్‌కుమార్ నివాసంలో ఇష్ట లింగ పూజ, గురువు పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు పలు సూచనలు అందజేశారు. సమాజంలో ప్రతిఒక్కరూ ధర్మాన్ని కాపాడేందుకు దైవారాధన చేయాలన్నారు. శ్రావణమాసం ఎంతో పవిత్రమైందని నిర్మలమైన మనస్సుతో భగవంతుడిని ఆరాధించాలన్నారు.

హామీలను విస్మరించిన బీఆర్‌ఎస్, కాంగ్రెస్


మాట్లాడుతున్న నందు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, దిశ కమిటీ సభ్యుడు వడ్లనందు

ధారూరు: బీఆర్‌ఎస్..కాంగ్రెస్ పార్టీలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజలను మోసం చేశాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, దిశ కమిటీ సభ్యుడు వడ్లనందు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఆదివారం ధారూరు మండల అధ్యక్షుడు రాజునాయక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రోజురోజుకు ప్రజల్లో బీజేపీపై ఆదరణ పెరుగుతుందని, ఎంపీ ఎన్నికల్లో వచ్చిన మెజారిటీ ఓట్లే నిదర్శనమన్నారు. మండలంలోని 12 ఎంపీటీసీ స్థానాలను, 34 సర్పంచు స్థానాలను కై వసం చేసుకోవాలంటే సంఘటితంగా కృషి చేయాలన్నారు. జెడ్పీటీసీ స్థానాన్ని కై వసం చేసుకుని బీజేపీ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. 20 నెలల కాంగ్రెస్ పాలన ప్రజలను మభ్యపెట్టడానికే పరిమితమైందని, హామీల అమలు ఊసేలేదని విమర్శించారు. 10 సంవత్సరాలు పాలించిన బీఆర్‌ఎస్ పార్టీ కూడా తెలంగాణ అస్తిత్వాన్ని నిరుపయోగం చేసిందన్నారు. రెండు పార్టీలు రాష్ట్రాన్ని దోచుకోవడంలో పోటీపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు శివరాజు, బీజేపీ సీనియర్ నాయకుడు పాండుగౌడ్, జిల్లా పార్టీ అధ్యక్షుడు వివేకానంద రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రాజేందర్‌గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు రమేశ్, రుద్రారం వెంకటయ్య, రవీందర్, పరమేశ్, కృష్ణ, రాఘవేందర్‌గౌడ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అత్యధిక స్థానాలను సాధించుకోవాలి

కుల్కచర్ల: స్థానిక ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాలను సాధిస్తుందని కుల్కచర్ల మండల బీజేపీ అధ్యక్షుడు జి.వెంకటయ్య ముదిరాజ్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీల కోటాలో ఇతర వర్గాలకు చెందిన వారికి రిజర్వేషన్లను మళ్లించాలని అధికార పార్టీ చూస్తోందని ఆయన ఆరోపించారు. బీసీలకు దక్కాల్సిన రిజర్వేషన్ ఇతరులకు తరలిస్తే ఊరుకోమని హెచ్చరించారు. రానున్న స్థానిక ఎన్నికల్లో బీజేపీ మెజార్టీ సీట్లను కై వసం చేసుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

స్థానిక ఎన్నికల్లో బీజేపీ సత్తాచాటాలి


యాలాల: మాట్లాడుతున్న బాలేశ్వర్‌గుప్తా

జిల్లా ఎన్నికల కన్వీనర్ బాలేశ్వర్‌గుప్తా

యాలాల: రానున్న స్థానిక ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని జిల్లా ఎన్నికల కన్వీనర్ బాలేశ్వర్‌గుప్తా పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని ఓ ఫంక్షన్ హాల్లో పార్టీ మండల అధ్యక్షుడు శివకుమార్ అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో ఇంటింటికీ చేరవేయాలన్నారు. గత ఎంపీ ఎన్నికల్లో పని చేసినట్లు స్థానిక ఎన్నికల్లో కూడా కష్టపడి పార్టీ అభ్యర్థుల గెలుపులో భాగస్తులు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ మాజీ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, నాయకులు రమేశ్, కాశీనాథ్, రమేశ్‌గౌడ్, బాజారప్ప, రామ్యనాయక్, వెంకటేష్, బూరెప్ప తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యం

తాండూరు రూరల్: స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్‌కుమార్ అన్నారు. మండల ఉపాధ్యక్షుడు గాండ్ల సిద్దప్ప అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో స్థానిక సంస్థల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పటేల్ విజయ్‌కుమార్, ఆంజనేయులు, సాయిరెడ్డి, చిరంజీవి, మల్లికార్జున్, మల్లేషం తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రధాత కలాం

ఏఎంసీ వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి

కడ్తాల్: భవిష్యత్ తరాలకు మార్గదర్శకుడు, యువతకు స్ఫూర్తి ప్రధాత భారత రత్న, మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం అని మార్కెట్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడురు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం అబ్దుల్‌కలాం వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కలాం దేశానికి ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు జహంగీర్‌బాబా, లక్పతినాయక్, జహంగీర్‌అలీ, యాదగిరిరెడ్డి, నరేశ్‌నాయక్, ఇమ్రాన్‌బాబా, శంకర్, మల్లేశ్‌గౌడ్, కేశవులు, సుధాకర్, రాజేందర్‌గౌడ్, ఉపేందర్, అజ్గర్‌అలీ, ప్రవీణ్, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.